క్లుప్తంగా

రహదారికి మరమ్మతులు

తిరువూరు: స్థానిక కోకిలంపాడు రోడ్డు గోతుల మయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా మురుగునీరు, వర్షపు నీరు పారుదలకు వీలుగా తాత్కాలిక డ్రెయినేజీ తవ్వించి రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని 60 అడుగుల మేర వెడల్పు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులు గతంలో నిర్ణయించినప్పటికీ నిధులు మంజూరు కాక పనులు ప్రారంభించలేదు. ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల నడుమ రాకపోకలకు వీలుగా ఈ రహదారిని అభివృద్ధి చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

'శిక్షా సప్తాహ్' ప్రారంభం

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పునాది అభ్యసనం, సంఖ్యా శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు.

- **ముసునూరు:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభమైంది. పాఠశాలల్లో స్థానిక వనరులతో తయారు చేసిన బోధనా సామగ్రి ప్రదర్శనలను మంగళవారం నిర్వహించారు. పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్ర పరిచయం, నైపుణ్యాల అభివృద్ధి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

పరిశుభ్రతపై అవగాహన

తిరువూరు: వర్షాకాలంలో సాధారణంగా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ప్రముఖ వైద్య నిపుణులు వివేకానంద అన్నారు. స్థానిక రాజుపేటలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వేడి ఆహారాన్ని భుజించాలని, జలుబు, దగ్గు, జ్వరం బారిన పడినప్పుడు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, స్థానిక ప్రతినిధులు హరికృష్ణ, రాంప్రదీప్, సుధాకర్, పాపారావు, శీనయ్య పాల్గొన్నారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యకు ప్రోత్సాహంపై హర్షం

ఇబ్రహీంపట్నం: నూతన విద్యా విధానంలో భాగంగా ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యను ప్రభుత్వం ప్రోత్సహించడంపై ఏపీ ఆర్ట్స్ క్రాఫ్ట్స్ పీఈటీ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు నిశ్శంకర గాయత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి కృషి ఫలితంగా ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. హస్తకళల విద్యతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, నైపుణ్యం పెరుగుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

ముసునూరు: పాఠశాల ప్రాంగణాలు, పరిసరాలు, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆదేశించారు. మండలంలోని చిల్లబోయినపల్లి ఐసీఎం, గుడిపాడులోని ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లో సౌకర్యాలను, టాయిలెట్లు, మంచినీటి సరఫరా ట్యాంకులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరులో మలేరియా సర్వే

తిరువూరు: మలేరియా జ్వర పీడితుల గుర్తింపునకు తిరువూరు ఒకటో వార్డులో మంగళవారం సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు సమగ్ర సర్వే నిర్వహించారు. రోజుల తరబడి జ్వరం బారిన పడిన వారిని గుర్తించి అవసరమైన వైద్య సహాయం అందజేశారు. రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 300 నమూనాలు సేకరించామని అధికారులు తెలిపారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం పర్యవేక్షించారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం

ఆగిరిపల్లి: నరసాపురం ఎంపీడీఓ రమణ మృతి బాధాకరమని ఆగిరిపల్లి ఎంపీడీఓ శామ్యూల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శామ్యూల్, కార్యాలయ సిబ్బంది రమణకు నివాళులర్పించారు. ఏఓ అబ్దుల్ సలాం, సిబ్బంది పాల్గొన్నారు.

26న వాడపల్లికి బస్సు సర్వీసు

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 26న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. 26న రాత్రి 10 గంటలకు తిరువూరు నుంచి బస్సు బయలుదేరి వీఎం బంజరు, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు మీదుగా తెల్లవారు ఝామున మూడు గంటలకు వాడపల్లి చేరుతుందని చెప్పారు. తిరిగి వాడపల్లిలో ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ఒక్కో ప్రయాణికుడికి రానుపోను రూ.750 టికెట్ ధర నిర్ణయించామని చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా రిజర్వేషన్ సదుపాయం కల్పించామన్నారు. ఇతర వివరాలకు సెల్: 98856 61835 నంబరులో సంప్రదించాలని కోరారు.

వెలగని వీధి దీపాలు

ఆగిరిపల్లి: స్థానిక రజక వీధిలో 20 రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. స్థానికులు, చిన్న పిల్లలు చీకటిలో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

- వర్షాలతో సాగు పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- మెలకువలు పాటించాలని రైతులకు అధికారుల సూచన



కిలేశపురంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



నాట్లు వేస్తున్న కూలీలు

ఇబ్రహీంపట్నం: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పంట సాగుకు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు ఇటీవలి కాలం వరకు వరుణుడి కరుణ కోసం ఎదురు చూశారు. అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలతో పొలాల్లో నీరు చేరడంతో ట్రాక్టర్లతో దమ్ముచేసి వరి నాట్లు వేయడం ప్రారంభించారు. ఈ ఏడాది సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో సాగుకు అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అధికారుల అంచనాలకు అనుగుణంగా ఇప్పటికే సుమారు రెండు వేల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు ప్రారంభమైంది.

సాగు పనుల్లో నిమగ్నం..

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఊపందుకోవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జూపూడి, త్రిలోచనాపురం, కొటికలపూడి, చిలుకూరు, దాములూరు, కాచవరం, లంక గ్రామాల మెట్ట పొలాల్లో పత్తి, పసుపు, అపరాలు, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయ పంటల సాగు చేపట్టారు. ఇబ్రహీంపట్నం, జూపూడి, మూలపాడు, కిలేశపురం గ్రామాల్లో వరి సాగు చేశారు. వరి 700 ఎకరాలు, పత్తి 600 ఎకరాలు, పసుపు 50 ఎకరాలు, అపరాలు 200 ఎకరాలు, మొక్కజొన్న 250 ఎకరాలు, కూరగాయలు 200 ఎకరాలు మొత్తం రెండు వేల ఎకరాల్లో సాగు పూర్తిచేశారు.

రైతులకు అవగాహన

వర్షాకాలంలో పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖాధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఓవైపు రైతులు పంట సాగు చేస్తున్న సమయంలో అధిక వర్షాలు కురవడంతో రైతులకు, పంటలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో సాగులో అవలంబించాల్సిన మెలకువలు యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా ప్రచారం చేపట్టారు. కురుస్తున్న వర్షాలతో పంటలు నీటి ముంపునకు గురైతే అధిక తేమ వలన పంటలకు పోషక లోపాలు తలెత్తి తెగుళ్లు ఆశిస్తాయి. నీటి ముంపునకు గురైన పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు

నీటి ముంపునకు గురైన పంట పొలాల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ అధికారి డి.శైలజ రైతులకు పలు సూచనలు చేశారు. అవి...

- 30 రోజుల వ్యవధిలోపు వరి నారుమడి నీటి ముంపునకు గురైతే ఐదు రోజుల్లో నీటిని పూర్తిగా బయటకు పంపాలి. ఐదు సెంట్ల నారు మడికి కిలో యూరియా, కిలో పొటాష్, రెండు గ్రాముల కార్బెండిజమ్, మాంకోజెబ్ పిచికారీ చేయాలి. పిలకదశ పంట మునిగితే 20 కిలోల చొప్పున యూరియా, పొటాష్ వేయాలి.
- పత్తిలో 20 నుంచి 30 రోజుల దశలో పత్తి పంట మునిగితే నీటిని బయటకు తీసి 20 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఎరువులు వేసుకోవాలి. మొక్కలు వడబారితే మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 100 మిల్లీ గ్రాముల స్ట్రెప్టో సైక్లిన్ వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్కలపై పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు ప్రొపికోనాజోల్ ఒక మిల్లీ లీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చదోమ నివారణకు మోనోక్రోటాఫాస్ 1.6 మి.లీ చల్లుకోవాలి.
- మొక్కజొన్నలో నిలిచిన అధిక నీటిని బయటకు తీసి లీటర్ నీటికి ఐదు గ్రాముల చొప్పున మల్టీకే (13-03-45) పిచికారీ చేయాలి.
- మొక్కలు వడబడితే లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు రిడామిల్ గోల్డ్ కలిపి చల్లాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వర్షాలు అనుకూలించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం అధికంగా కురిసిన వర్షాలతో పంటలు నీటి ముంపునకు గురైతే రైతులు తక్షణం యాజమాన్య పద్ధతులు పాటించాలి. నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం రెండు వేల ఎకరాల్లో పంటలు వేశారు.

– డి.శైలజ, వ్యవసాయాధికారి, ఇబ్రహీంపట్నం

- అపరాలలో ఇనుపధాతువు లోప నివారణకు అన్నబేది 50 గ్రాములు, ఐదు గ్రాముల నిమ్మ ఉప్పు, 150 గ్రాముల యూరియా 10 లీటర్ల నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మూడు గ్రాముల మాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

27న మెగా జాబ్ మేళా

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో కళాశాల పూర్వ విద్యార్థులతో కలిసి నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో 17 ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని చెప్పారు. కళాశాల ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకటాద్రి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు సెల్: 63050 04318 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

దోమల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్



చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేలలో విష జ్వరాలు ప్రబలుతుండటంతో దోమల నిర్మూలనకు సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఫాగింగ్ మిషనుతో గ్రామంలోని అన్ని వీధుల్లో దోమల నియంత్రణ చర్యలు ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో జ్వరపీడితుల సంఖ్య పెరగడంతో వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసింది. జ్వరాలు వ్యాప్తి చెందకుండా పంచాయతీ ఆధ్వర్యంలో వీధులు శుభ్రం చేయడంతో పాటు ఫాగింగ్ చేయడం, దోమల నిర్మూలనకు ఎబేట్ మందు పిచికారీ చేశారు.

మందుల ధరల తగ్గింపు మంచి నిర్ణయం

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు



మైలవరం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశ పెట్టిన 2024–2025 వార్షిక బడ్జెట్ జనరంజకంగా ఉందని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పెద్దపీట వేశారన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడంపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైనన్ని నిధులు మంజూరు చేస్తామని చెప్పడం స్వాగతించదగిన విషయమన్నారు. బంగారం, వెండిపై ఆరు శాతం కస్టమ్స్ పన్ను తగ్గించడం మధ్య తరగతి కుటుంబాలకు ఊరటనిస్తుందని చెప్పారు. క్యాన్సర్ రోగులకు ఉపయోగించే మందుల ధరలు తగ్గించడం మంచి నిర్ణయమన్నారు. విభజన చట్టం ప్రకారం హామీలను నేరవేర్చే దిశగా కేంద్ర బడ్జెట్ ఉందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందించే దిశగా విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తదితరాలు హర్షణీయమన్నారు.

పోలవరానికి నిధులపై హర్షం

కోయ సుధ



కేంద్ర వార్షిక బడ్జెట్ జనరంజకంగా ఉందని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కోయ సుధ అన్నారు. బడ్జెట్‌లో అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించడం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పడం, క్యాన్సర్ రోగులకు ఉపయోగించే మందుల ధరలు తగ్గించడం మంచి నిర్ణయమన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. విపత్తుల నిర్వహణపై పట్టు సాధించాలని ఆమె సూచించారు. దోమల నివారణ చర్యలతో వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. గ్రామాల్లో కేటాయించిన ఇళ్ల స్థలాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. వివిధ కోర్టు కేసులపై సమీక్షించారు. ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన నూజివీడు ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

రెండు రోజుల్లో 882 సీట్లు భర్తీ



నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రవేశాల కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. రెండో రోజు కౌన్సెలింగ్‌కు 535 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా అందులో 446 మంది హాజరయ్యారు. వారికి సీట్లు కేటాయించారు. రెండు రోజుల్లో 1,050 మందికి గాను 882 మందికి అడ్మిషన్లు ఇచ్చారు. వీరిలో బాలురు 305 మంది, బాలికలు 577 మంది ఉన్నారు. కౌన్సెలింగ్‌కు రాని అభ్యర్థులు ఇంటర్, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి ఉండొచ్చని ట్రిపుల్ ఐటీ అధికారులు భావిస్తున్నారు. మిగిలిన 168 సీట్ల భర్తీకి త్వరలోనే రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్, ఏఓ టి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏడీఏ జి.విద్యాసాగర్

నూజివీడు: నియోజకవర్గంలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో వరి నారుమడులు, వరి నాట్లు ఊపందుకున్నాయని ఏడీఏ జి.విద్యాసాగర్ అన్నారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో నాట్లు వేసిన వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఇటీవల వర్షాలు కురిసినందున వరి నారు మడుల్లో నీరు అధికంగా ఉంటే ఐదు సెంట్లకు ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్‌ను చల్లాలన్నారు. వరి నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురైతే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ చల్లాలని, నీరు ఎక్కువ నిల్వ ఉండకుండా వలుచగా ఉంచుకోవాలన్నారు. వరి నారు మడులకు తెగులు సోకకుండా ఒక గ్రాము కార్బెండిజమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. జూలైలోపు వరి వంట వెదజల్లేటట్లయితే మధ్యకాలిక రకాలు, ఆగస్టులో వెదజల్లేటట్లయితే స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. పత్తి పంట నియోజకవర్గంలో ఎక్కువగా వర్షాధారంపై సాగవుతున్నందున నల్లరేగడి నేలలు అనుకూలమన్నారు. పత్తిలో వేరుకుళ్లు నివారణకు మొక్క మొలిచిన తరువాత మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలని సూచించారు. వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఎర్రమాడులో ఆధార్ నమోదు కేంద్రం



ఎర్రమాడు కేంద్రంలో ఆధార్‌ను అప్‌డేట్ చేసుకుంటున్న గ్రామస్తుల

తిరువూరురూరల్: మండలంలోని ఎర్రమాడు ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న తల్లికి వందనం పథకానికి అర్హులైన తల్లులు తమ ఆధార్ కార్డులను నవీకరించుకోవాలని అధికారులు ఇచ్చిన సూచనల మేరకు పలువురు మహిళలు ఈ కేంద్రంలో ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకున్నారు. ఆధార్‌కు ఫోన్ నంబరు లింక్ చేయడం, తప్పుల సవరణ తదితర ప్రక్రియను సిబ్బంది నిర్వహించారు. సర్పంచి బొర్రా మోహనరావు పర్యవేక్షించారు.

- **చాట్రాయి:** మండలంలోని చాట్రాయి, చనుబండ–1 సచివాలయాల పరిధిలో మంగళవారం ఆధార్ బయోమెట్రిక్ కార్యక్రమం ప్రాంభించారు. ఆధార్ అప్‌డేట్ కాని వారు అప్‌డేట్ చేసుకుని ఫోన్ నంబర్లు లింకు చేసుకున్నారు. కార్యక్రమంలో చాట్రాయి సర్పంచ్ దామెర ఉషా కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** ఆధార్ నమోదు కేంద్రాలు కొండపల్లి మున్సిపాల్టీలోని పలు సచివాలయాల పరిధిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులకు ఆధార్ నమోదు చేయించారు. గతంలో చిన్నారులకు నమోదు చేసిన ఆధార్‌కు అప్‌డేట్ చేయించారు. ఫోన్ నంబర్‌ను లింక్ చేయించారు. కొండపల్లి జెడ్పీ బాలుర పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ నమోదు పత్రాలను ప్రజలకు అందజేశారు.

ఆధార్ నమోదు కేంద్రం పరిశీలన



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిరణ్ కుమార్

నూజివీడు: మండలంలోని యనమదలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ నమోదు కేంద్రానికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ నెల 24న మండలంలోని అన్నవరం, హనుమంతుల గూడెం, దేవరగుంట, మొర్సపూడి, పోలసానపల్లి, దిగవల్లి, 25న తూర్పు దిగవల్లి, ముక్కొల్లుపాడు, గొల్లపల్లి–1, గొల్లపల్లి–2, పోతురెడ్డిపల్లి, 26న సిద్దార్థ నగర్, మీర్జాపురం, మర్రిబంధం, వెంకటాయపాలెం, 27న తుక్కులూరు, జంగంగూడెం, ఎంఎస్‌పాలెం, సీతారామపురం, పల్లెర్లమూడిలలో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆదర్శప్రాయులు తిలక్, ఆజాద్



లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలవరం: స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో వీరిరువురూ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. చరిత్ర విభాగం అధ్యాపకులు దారావతు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ నిర్వహించిన హోమ్ రూల్ ఉద్యమం ప్రముఖమైందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పురంశెట్టి రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **లక్ష్మీపురం(తిరువూరురూరల్):** స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమం తిరువూరు మండలం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయోద్యమంలో వీరి పాత్రను ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు సుజాతకుమారి, పద్మలత, లక్ష్మీ శ్యామల పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను సీతారాంపురం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గరిక నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్, జోసఫ్, లక్ష్మి పాల్గొన్నారు.

యువత కోసం 'అలనాటి రామచంద్రుడు'

డైరెక్టర్ ఆకాష్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న హీరో, హీరోయిన్ కృష్ణవంశీ, మోక్ష

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): నేటి యువతరాన్ని ఆకట్టుకునేలా 'అలనాటి రామచంద్రుడు' సినిమా తీశానని చిత్ర దర్శకుడు చిలుకూరి ఆకాష్‌రెడ్డి తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం మంగళవారం కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. డైరెక్టర్ ఆకాష్‌రెడ్డి, హీరో కృష్ణవంశీ, హీరోయిన్ మోక్షకు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య స్వాగతం పలికారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. హీరో, హీరోయిన్ విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి జోష్ నింపారు. చిత్రానికి సంబంధించి కాంటెస్ట్ నిర్వహించారు. విజేతలకు టీషర్టులు, క్యాప్‌లు అందజేశారు. సినిమాను ఆగస్టు 2న థియేటర్లలో మాత్రమే చూడాలని, పైరసీకి తావివ్వద్దని సూచించారు. యూత్‌కు నచ్చే మంచి లవ్‌స్టోరీతో సినిమా ఉంటుందని డైరెక్టర్ వివరించారు.

నేడు గ్రామాలలో ఆధార్ శిబిరాలు

విజయవాడరూరల్: ఆధార్ నమోదు, సవరణల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాలు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జరుగుతాయని ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి–3 సచివాలయం, జక్కంపూడి 2 సచివాలయం, గూడవల్లి 2 సచివాలయం, జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్ నున్న సచివాలయం 2లో శిబిరాలు నిర్వహిస్తారని వివరించారు.

నేడు తపాలా శాఖ సేవలపై అవగాహన

విస్సన్నపేట: తపాలా శాఖ సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం స్థానిక శ్రీశ్రీ డిగ్రీ కళాశాల వద్ద బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మహ్మద్ ఆసీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలాశాఖ అందించే వివిధ సేవలను వివరిస్తారని చెప్పారు

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఇబ్రహీంపట్నం: జాతీయ ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ గురువారం నిర్వహిస్తామని ఎంపీడీవో ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో గుర్తించిన అంశాలు, అభ్యంతరాలు మండల సామాజిక తనిఖీలో చర్చిస్తారన్నారు. సభకు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

పూడిక తీత

జి. కొండూరు: రెడ్డిగూడెంలోని అంతర్గత రోడ్లకు ఇరువైపులా కందకాలలో పూడిక తీత పనులు చేపట్టారు. మంచినీటి సరఫరా పథకాలను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. కార్యక్రమాలను ఎంపీడీఓ ఆశీర్వాదం, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, రమేష్ పర్యవేక్షించారు.